# తప్పిన కల

సుధాంశు




ఆలానికి రైలు తప్పిపోయింది. కులపర్వతాలు కుంగిపోయినట్లూ భూమండలం బ్రద్దలైనట్లూ, సూర్యచంద్రుల గతులు తప్పినట్లూ అనిపించింది. శేఖరానికి రోజూ ఆఫీసులో, ఆ వృద్ధ జంబుకాన్ని మెప్పించి ఒప్పించి, ఆదివారం వాడు హెడ్ క్వార్టర్స్ వదిలి పెట్టటానికి పర్మిషన్ తీసుకొని బయటబడేసరికి తాతలు దిగి వచ్చారు. శేఖరం వాచీ చూసుకున్నాడు. సరిగ్గా ఏడుగంటలైంది. మసక మసకగా చీకటి పడుతున్నది. పల్లె పట్టణంగాని ఆ దిక్కు మాలిన ఊళ్లోకి మధ్య దిగుమతి అయిన ఏడు రిక్షాలలో ఒక్కటి గూడా కనుచూపు మేరలో కనబడి చావలేదు. ఇక తప్పదనుకొని ఏడుంబావు అయ్యేసరికే ఉరుకులూ పరుగులూ పెట్టి ఒళ్లంతా దిగచెమటలు పట్టి స్టేషన్‌కు చేరుకున్నాడు శేఖరం. అదేం పొయ్యేకాలమోగాని ఎన్నడూ టైముకు రాని రైలు ఆనాడు కొంప మునిగినట్టు అయిదు నిమిషాలు ముందుగానే దయ చేసింది. శేఖరం టిక్కెట్ కొనుక్కొని, ప్లాట్ ఫారం మీద అడుగు పెట్టేసరికి "ఆగు నాయనా! ఆగు. నీవు ఆర్చుకొని తీర్చుకొని వచ్చే దాకా నేనెక్కడుండేది!" అన్నట్టు తిరస్కారంగా పొగలు గక్కుతూ స్టేషన్ దాటిపోయింది రైలుబండి. ఆ విధంగా తనొక్కణ్ణే నిర్దాక్షిణ్యంగా వదలిపెట్టి వెళ్లిపోతున్న ఆ రైలుబండిని చూస్తున్నకొద్దీ కోపం, అసహ్యం, ద్వేషం, దుంఖం పొంగి వస్తున్నాయి శేఖరానికి. తన తొందర గుర్తించకుండా ఏడు గంటల దాకా జీడిలాగా పీడించుకుతిన్న ఆఫీసర్ మీద పట్టరాని కోపం వస్తున్నది. అయినా ఇక ఇప్పుడు ఏమనుకొనీ తాను చేయగలిగింది ఏమీలేదు. చేతిగుడ్డతో ముఖం తుడుచుకొని ఉస్సురంటూ ఆ పక్కన ఉన్న సిమెంటు బల్ల మీద చేరగిలబడ్డాడు శేఖరం. అతని మనస్సంతా వికలమైపోయింది. రైలుదిగిన నలుగురైదుగురూ మూటాముల్లె సర్దుకొని తమ దారిన తాము వెళ్లిపోయారు. అంతా శేఖరం మనస్సులాగానే శూన్యం అయిపోయింది. సమాంతరరేఖల్లాగా ఒక దానితో ఒకటి కలవకుండా ఉన్న రైలు పట్టాల వైపు చూపు ఆనిందాకా చూశాడు శేఖరం. జేబులో ఉన్న సిగరెట్ తీసి ముట్టించాడు. గట్టిగా దమ్ము పీల్చి ఉంగరాలు ఉంగరాలుగా పొగవదులుతూ అంతులేని ఆలోచనల్లో మునిగిపోయాడు శేఖరం.

"ఒక్క నిమిషంలో తనకు రైలు తప్పిపోయింది. ఇక తమ ఊరికి వెళ్లాలంటే రేపు ఉదయం దాకా బండి లేదు. తను తప్పకుండా ఆ బండికే బయలుదేరి వస్తున్నానని నాన్నగారికి ఉత్తరం రాసివేశాడు! తన కోసం అక్కడ ఎంతో ఆశగా ఎదురు చూస్తూ ఉంటారు. ఏంలాభం! ఇప్పుడు తన ప్రయాణం ఇలా అయిపోయింది!

ప్రయాణానికి ఏ ఆటంకం రాకుండా ఉండాలనే తను నాలుగురోజులనుంచీ ఆఫీసులో రోజుకు మూడుగంటలు వంతున ఎక్కువ పని చేశాడు. తీరా పర్మిషన్ అడిగే సరికే ఆ ఆఫీసర్ ఏం అడ్డం వేస్తాడో అని ఈమధ్య ఆయన చెప్పిన పనల్లా కిక్కురు మనకుండా చేశాడు. ఏ ఫైలూ పెండింగ్ లేకుండా క్లియర్ చేద్దామని విశ్వప్రయత్నం చేశాడు. అయినా సరే, ఆ ఆఫీసరు ఇవ్వాళ అయిదు గంటలకు తను రైలుకు బయలుదేరుదామని అనుకుంటూ ఉండగానే, ఒక దిక్కుమాలిన పాతఫైలు బూజు దులిపి అర్జంట్‌గా నోట్‌రాసి తెమ్మని ఇచ్చి పంపాడు. అది చదివి నోట్ పెట్టి, దానితో పాటు పర్మిషన్ కోసం కాగితం కూడా పట్టుకెళ్లి ఆయన ముందుపెట్టి అతివినయంగా చేతులు కట్టుకొని నిలబడ్డాడు తను. ఫస్ట్‌క్లాస్ ఎం. ఏ. అయిన తను ఆ యస్. యస్. యల్. సి. ఆఫీసరు ముందు కాలం, కర్మం కలిసి రాక అంత వినయంగా నిలబడినందుకైనా మెచ్చుకొని తక్షణం పర్మిషన్ ఇచ్చి పంపవలసింది ఆఫీసరు. అబ్బే! అంత వివేకం ఆయన కెవరు అప్పిస్తారు? ఆ మహానుభావుడు అయిదు నిమిషాలు తనని ఆపాదమస్తకం పరీక్షించి చూసి, సవాలక్ష చొప్పదంటు ప్రశ్నలు వేసి, ఎట్టకేలకు తన సర్వస్వం దానం చేస్తున్నట్టు ఆదివారం నాడు ఊరికి వెళ్లటానికి పర్మిషన్ ఇచ్చాడు. అసలు ఆయన తనని ఆ విధంగా చిన్నచూపు చూడటానికి ప్రబలమైన కారణం ఒకటి లేకపోలేదు కూడా. తను ఎక్కడా దిక్కు లేక, ఏ ఉద్యోగం దొరక్క ఇక్కడ చేరిన సంగతి గ్రహించిన వాడు కావటం వల్లనే ఎంత ఇన్‌సల్ట్ చేసినా తను చచ్చినట్టు పడి ఉంటాడని ఆయన నమ్మకం. ఆ సంగతి తెలిసే తనుకూడా ఆయన దగ్గర ఎంతో వినయంగా ఉంటున్నాడు తప్ప ఎన్నడూ పొరపాటుగా ప్రవర్తించలేదు. అటువంటి తనకు ఒక్కరోజుకి పర్మిషన్ ఇవ్వటానికి ఆయనకి మాత్రం అంత ఆలోచనెందుకో? ఆఁ. అసలు సంగతి ఇప్పుడు జ్ఞాపకానికి వస్తున్నది. తను సర్వీస్‌లోచేరిన కొత్తల్లో ఈ ఆఫీసరు అప్పుడప్పుడూ "అదేమిటోయ్! ఫస్ట్‌క్లాస్‌లో యం. ఏ. ప్యాసైన వాడివి ఈ దిక్కుమాలిన గుమాస్తా ఉద్యోగానికి వచ్చావు ఎవరినో పట్టుకొని ఏ మంచి ఉద్యోగమో చూసుకోక." అని కూడా వల్లమాలిన సానుభూతి ఒలకబోస్తూ ఉండేవాడు. ఒకరోజున ఆఫీసులో అందరూ వెళ్లిపోయిన తరువాత ఒంటరిగా పని చేసుకుంటున్న తనని ఇంటికి రమ్మని బలవంతపెట్టి తీసుకెళ్లాడు. ఇంటికి చేరగనే "కూర్చో ఇది ఆఫీస్ కాదుగా!" అని వరండాలో ఉన్న కుర్చీలో తనను కూలదోసి, తనుకూడా తాపీగ పడకకుర్చీలో వాలిపోయాడు. "ఏమిటబ్బా! ఈవిపరీతానికి కారణం" అని తను ఆశ్చర్యపడిపోతూ ఉండగా ఆయన "అది సరేనోయ్ శేఖరం! ఎంత పిచ్చివాడివోయ్ నువ్వు! నిజంగా ఈ రోజుల్లో పుట్టవలసిన వాడివి కావు! ఈ కాలంలో అనుకున్న పని కావాలంటే పెద్దవాళ్లని ఆశ్రయించాలి! తగిన వాళ్లకు చెప్పించాలి! కార్యసాధనం చేసుకోవాలి! అంతేగాని, మన ఇంట్లో మనం కూర్చుంటే మన పనులు మరొకడు చేసిపెడతాడా? మన అవసరాలు మరొకడు తీరుస్తాడా? చూడు. నీలాగానే మా పెద్దల్లుడు కూడా పెళ్లి కాక ముందు ఉద్యోగం సద్యోగం లేకుండా డిగ్రీ కాగితం చంకన బెట్టుకొని ఆఫీసులన్నీ తిరుగుతూ ఉండేవాడు! ఒకనాడు నా కంట బడ్డాడు. తన అవస్థ అంతా చెప్పుకున్నాడు. నాకూ "మంచి బుద్ధిమంతుడు. పనికి వస్తాడు" అనిపించింది. వెంటనే ఏదో తగు ప్రయత్నం చేశాం. మూడువందల రూపాయల ఉద్యోగం అంతడి కాళ్ల దగ్గరకు నడిచి వచ్చిందనుకో. అదీ పద్ధతి పైకి రావాలంటే! తెలిసిందా?" అన్నాడు గుక్క తిప్పుకోకుండా.

తను ఏం మాట్లాడాలో నిర్ణయించుకోలేక తప్పనిసరిగా తలవూపాడు. "చిన్నమ్మాయ్! చిన్నమ్మాయ్! రెండుకప్పుల్లో కాఫీ తీసుకురావమ్మా!" అని లోపలికి చూచి కేకపెట్టాడు ఆఫీసరు. కొంతసేపటికి ఒక గున్న ఏనుగు లాంటి కన్యారత్నం పై పెదవితో దీర్ఘదంతాలని కప్పిపుచ్చుకోటానికి వ్యర్థప్రయత్నం చేస్తూ రెండు కప్పులు కషాయం తెచ్చి అక్కడ పెట్టి పరుగెత్తిపోయింది. "తీసుకోవోయ్ తీసుకో! మరీ అంత పరాయి వాడిలాగా మొగమాటపడకు." అంటూ ఒక కప్పు తన చేతికిచ్చి రెండో కప్పు తానందుకున్నాడు ఆఫీసరు. కాఫీలు కాగానే మళ్లీ అందుకున్నాడు ఆయన ఉపన్యాసం. "చూశావుటోయ్ శేఖరం! అది మా చిన్నమ్మాయి! చాలా బిడియస్థురాలు. అందుకే అలా పరుగెత్తిపోయింది. తొందరలో నీలాటి బుద్ధిమంతుడ్ని చూసి మూడు ముళ్లూ వేయించేద్దామని అనుకుంటున్నాను. ఆడపిల్లలకిగానీ మగపిల్లలకిగానీ చిన్నతనంలోనే పెండ్లిండ్లు చేసేస్తే ఉభయులకూ ఎంతో శ్రేయస్కరం అని నా అభిప్రాయం. అమ్మాయికి ఇంకా పదిహేడు దాటలేదనుకో. మొన్న అక్టోబర్‌లో యస్. యస్. యల్. సి. పూర్తి చేసింది. మన సంసారపక్షంలో ఆడపిల్లలకి అంతకంటే పెద్దచదువులెందుకూ? ఏమంటావ్?" అని లొట్టపీటి కళ్లద్దాలలోంచి తన కళ్లల్లోకి సూటిగా చూశాడు ఆఫీసరు. తను అప్పుడు ఏం అంటే ఏమవుతుందో అని అవునన్నట్టు చిరునవ్వునవ్వి వూరుకున్నాడు. మళ్లీ ఆయనే ప్రారంభించాడు. "అది సరేగాని శేఖరం అసలు సంగతి మరిచేపోయాను. నీకు ఇప్పట్లో పెళ్లి చేసుకునే ఆలోచనేమైనా ఉందా? అహా. ఈకాలంలో "నాకు పెళ్లి వద్దు" అనటం ఆడామగా అందరికీ ఒకొక ఫ్యాషనైపోయిందిలే! అందు కడుగుతున్నాను. ఏమీ అనుకోకు. నిన్ను చూస్తుంటే నా కెందుకో 'ఆత్మీయుడు' అనే భావం కలుగుతున్నదిలే!" అంటూ, 'కొంచెం ఆలోచించుకొనే సమాధానం చెప్పాలే' అన్నట్టు ఈజీచైర్‌లో అలా వాలిపోయాడు ఆఫీసరు. ఇక వ్యవహారం ముదురుపాకంలో పడుతున్నదని గ్రహించుకున్నాడు తను. మరి కొంచెం సేపుంటే ఆ గున్నఏనుగు సంగతి స్పష్టంగా ప్రస్తావించేటట్లు ఉన్నాడు మహానుభావుడు! అందువల్ల ఇక ఆ ప్రసంగానికి ఫుల్‌స్టాప్ పెట్టాలని నిశ్చయించుకున్నాడు తను. అటువంటి ఆపత్కాలంలో, అందులోనూ వివాహ విషయంలో అసత్యం ఆడినా దోషం లేదనే శుక్రనీతి తెలిసినవాడు కాబట్టి అప్పటికప్పుడు ఆత్మరక్షణ కోసం అవలీలగా ఒక అబద్ధం ఆడేసి ముప్పు తప్పించుకోవాలని అనుకున్నాడు తను.

అసలు తన పెళ్లి సంగతి గురించి నిజం చెప్పాలంటే — "ఆ

మిటో సార్! చిన్నతనం నుంచి గూడా వాదంతా అదొక తత్వం సార్! ప్రబంధాలన్నీ కూడా చదువుకున్నానేమో అచ్చంగా ప్రబంధ సుందరి లాంటి పిల్ల దొరికితేనే చేసుకోవాలని నిశ్చయించుకున్నాను సార్! పద్మాల వంటి కళ్ళూ, చంద్రబింబం లాంటి ముఖం, శంఖం వంటి కంఠం, నువ్వు పువ్వులాంటి ముక్కూ, శ్రీకారాల వంటి చెవులూ, పిడికిలికి ఇమిడే నడుమూ, తామరతూళ్ళ వంటి చేతులూ, కమలాల వంటి కాళ్ళూ కలిగి ఉన్న పిల్ల అయితేనే నాకు నచ్చుతుంది సార్! అంతే కాకుండా నాకు కాబోయే భార్య లలితకళల్లో నైపుణ్యం, పాకశాస్త్రంలో ప్రావీణ్యత ఉన్న మంచి జాతకురాలు కావాలి. నా అభిరుచికి తగినట్టు అన్ని లక్షణాలూ సమగ్రంగా లేకపోవటం వల్లనే, పుట్టిన దగ్గర్నుంచీ నాకే ఇవ్వాలని ఆశ పెట్టుకున్న మా మామకూతురు జానకిని చేసుకోవటానికి ఇటీవల దాకా నేను ఒప్పుకోలేదు సార్! ఆ విషయంలో నాన్నగారు ఒత్తిడి చేసినా, అమ్మా బామ్మా బతిమాలినా నేను ఏమాత్రమూ మెత్తబడకుండా, నేను కోరే ఊహాసుందరి కోసం ఎక్కని గడప తొక్కకుండా పది పన్నెండు మంది పెళ్లికూతుళ్లను పరిశీలించి ప్రయోజనంలేక ఊరుకున్నాను సార్!'' అని ఉన్న విషయం పొంగోపొంగంగా ఆఫీసర్‌తో వివరించి చెప్పాలి గదా! ఆ విధంగా ఉన్న సంగతి దాచకుండా చెప్పటం ఆఫీసర్‌ని చిన్నబుచ్చటమే అవుతుందని ఆలోచించి, అనుకున్న అబద్ధం ఆడేశాడు తను. ''నాకు చిన్నతనంలోనే, అంటే నేను ఫిఫ్త్‌ఫారం చదివే రోజుల్లోనే మా మామకూతురితో పెండ్లి అయిపోయింది సార్! అందువల్ల ఇక ఆ ప్రశ్నే లేదు.'' అన్నాడు తను జాగ్రత్తగా. ఆ మాట వినగానే ఆఫీసర్ ముఖం పైసా అంత అయిపోయింది. ఆయన కుర్చీలో నుంచి అదిరిపడి లేచి ముఖం చిట్లించి ''సరేసరే. అలా చెప్పు. అయినా ఈ కాలంలో పెద్దవాళ్లకి కూడా మరీ మతిలేకుండా పోతున్నదోయ్! కాకపోతే పుట్టీ పుట్టక ముందే పెళ్లిళ్లు చేసెయ్యటం ఏమిటీ కొంప మునిగినట్టు? సరేగాని ఇక నీవు వెళ్లు. పొద్దుబోయింది. రేపు పొద్దున 8 గంటలకి ఆఫీసుకురా. ఆదివారం గదా అని నిద్రపోకు. అవసరంగా పైకి పంపే కాగితాలు కొన్ని చూడాలి.'' అంటూ లోపలికి వెళ్లిపోయాడు ఆఫీసరు. తను కూడా 'బతుకుజీవుడా!' అని బయటబడ్డాడు.

ఆ మర్నాటి నుంచీ ఆఫీసర్‌కి తన మీద చాలా గుర్రుగా ఉంది. చీటికీ మాటికీ చీదరించుకోవటం, ఎక్స్‌ట్రావర్కు ఎక్కువగా చేయిచటం, ఆదివారం కూడా ఆఫీసుకు రమ్మని ఆజ్ఞాపించటం, అన్నివిధాలా తనని పీడించి చంపుతున్నాడు. అయినా తను మంచిగానే అన్నీ సర్దుకుపోతున్నాడు. ఏం లాభం! తన మంచితనం ఏ రాణింపుకొచ్చింది! తను ఇవ్వాళ ఇంత ముఖ్యమైన ప్రయాణం పెట్టుకుంటే అన్యాయంగా పాడు చేశాడు ఆఫీసరు. తను రైలుకి వెళ్లాలని ఎంత తొందరపడుతున్నా లెక్కచెయ్యకుండా పట్టుబట్టి తనని అనవసరంగా ఎక్కువ సేపు ఆఫీసులో ఉంచి రైలందకుండా చేశాడు. నిజంగా ఈ రోజు అంటే తనకెంత విలువైందో ఆ ఆఫీసర్‌గాడి కేం తెలుస్తుంది? ఇంతకుముందు కూడా తనకు ఎన్నోసార్లు రైలు తప్పిపోయింది. అయినా తనెప్పుడూ ఇంత బాధపడలేదు. ఇంతకు ముందు రైలు తప్పటానికీ ఈ రోజు తప్పిపోవటానికీ కొండంత వ్యత్యాసం ఉంది. ఈరోజు రైలుకే తను తప్పకుండా ఇంటికి వస్తున్నానని రాశాడు. ఉత్తరం అంటే అది మామూలు ఉత్తరమా? ఆ ఉత్తరం చూడగానే నాన్నగారు అపారమైన ఆశ్చర్యానందంతో ఉక్కిరిబిక్కిరి అయి ఉంటాడు. వియత్నాం యుద్ధం సమాప్తమైనట్టూ, చైనా వాడికి శాంతి మీద నమ్మకం కలిగినట్టూ, దేశంలో ప్రజలందరికీ కూడా గుడ్డా సమకూరినట్టూ, నాయకులందరూ దేశసేవ కోసమే నడుం కట్టినట్టూ, అప్పు చేసినవాడు చెప్పిన రోజునే బాకీ తీర్చినట్టూ, తన ఉత్తరాన్ని కూడా ప్రపంచంలోని ఎనిమిదో వింతగా చూసి విభ్రాంతి పడిపోతారు. నాన్నగారు. తన ఏకైకపుత్రుడు ఇంత కాలానికి బుద్ధిమంతుడై తన పితృదేవతలకు గతి కల్పించబోతున్నాడని పుత్రోత్సాహంతో పొంగిపోతూ బామ్మని పిలిచి, ''మనవడు ఉత్తరం రాశాడే! జానకిని చేసుకుంటాట్ట!'' అని ఆ శుభవార్త కాస్తా ఆమె కందిస్తారు. ఆమాట చెవిని బడగానే బామ్మ పారాయణం చేస్తున్న భగవద్గీత ప్రక్కన పెట్టి పదిహేనేళ్ల కిందట పరమపదించిన తాతయ్య బ్రతికివచ్చినంత సంతోషపడిపోతూ ''ఏమిటేమిటీ! ఏం రాశాడురా శేఖరం వాడున? జానకినే చేసుకుంటానని రాశాడా? నా బంగారు తండ్రే! నా వరహాలకొండే! ఎంత మంచి మాట రాశాడు! ఒరే పరంధామయ్యా శేఖరం చివరికి ఈ విధం ఒప్పుకుంటాడని నాకెప్పుడో తెలుసురా! మన మాట కాదని వాడెక్కడికి పోతాడురా! నీదంతా అనుమానం గాని! నిండా పాతికేళ్లు లేని పిచ్చినాన్నవి! ''నీవు గట్టిగా చెప్పితే తప్పకుండా జానకినే ఒప్పుకుంటాడురా!'' అని నీ చెవుల్లో ఇల్లు కట్టుకొని పోరాడుతూ ఉంటే నీవు మాత్రం ఏమన్నావు! ''లాభం లేదులే అమ్మా! వాడూ నా అంత వాడైనాడు! వాడి ఉద్దేశాలు వాడికి ఉంటాయి! ఇటువంటి విషయంలో ఒత్తిడి చెయ్యటం మనకీ మంచిదికాదు. వాడి ఇష్టం వచ్చినట్టూ నచ్చిన పిల్లనే చేసుకోనిద్దాం!'' అని మాట్లాడకుండా ఊరుకున్నావు గదా! ఇప్పుడు చూడరా! ఇప్పుడు చూడు. వాడు ఎలా మారిపోయాడో! ''వద్దు'' అన్న దాన్నే మళ్లీ ''సరే'' అన్నాడా! వాడి స్వభావం నేనెరుగుదునురా! వాడిది తాతలాగానే మహాస్వతంత్ర బుద్ధిరా! ముందు కాదన్నా తరవాత వినే రకం వాడు! అయినా పైకి అలా అనేవాడేగాని వాడికి మాత్రం మామయ్యకూతురి మీద మనసుండదట్రా! అందులోనూ ఆమాను దగ్గరే ఆ గుంటూరులో ఉండి చదువుకున్న వాడికి అమాత్రం వాళ్ల మీద అభిమానం లేకుండా పోతుందా! అక్కడ ఉన్న నాలుగేళ్లూ ఆ జానకితో పాటు సినిమాలనీ షికార్లనీ ఆడుతూ పాడుతూ తిరగలేదూ! ఆ విశాఖపట్నంలో రెండేళ్లూ వెలగబెట్టిన తర్వాత గదూ వాడు వాళ్లనీ వీళ్లనీ చూసి ''పిల్ల నల్లగ ఉందనీ, చురుకుతనంలేదనీ, అదనీ, ఇదనీ వంకలు పెట్టి 'జానకి నాకక్కర్లేదు. మీరు నూరు చెప్పినా లక్ష చెప్పినా ఈ విషయంలో మీ మాట వినను' అని భల్లూకప్పట్టు పట్టింది! అయినా ఎర్రగా బుర్రగా ఉన్నారని అంతమంది పిల్లల్ని చూసివచ్చాడు గదా! ఒక్కటి గాకపోతే, ఒక్కతైనా నచ్చిందా అంట! ఎందుకు నచ్చుతుంది? ఎంత కాదనుకున్నా బ్రహ్మరాత తప్పుతుందిట్రా! వాడికి జానక్కి రాసిపెట్టి ఉంది. అలా జరగవలసిందే! ఇంతకీ ఇన్నా

ళ్ళకీ ఈ ఇంటికి మంచిరోజులొచ్చాయి. అంతా ఆ కృష్ణ పరమాత్ముడి దయ!''' అంటూ బామ్మ ఒక్కక్షణం కూడా ఆగకుండా పెద్ద లెక్చరిచ్చి ఉంటుంది!

ఇంకా సంతోషం పట్టలేక వంటింట్లో సతమతమవుతున్న అమ్మని "ఏమేవ్ శాంతా! రావే ఇలా రా! బంగారు తండ్రి ఉత్తరం రాశాడే! శేఖరం గాడూ ఉత్తరం రాశాడు. వినిపో. నా గొంతులో ఊపిరి ఉండగానే ఆ వాలుగ కంటిలా వెయ్యాలనేగా నా తాపత్రయం!" అంటూ గావుకేకలు పెట్టి పిలిచి ఉంటుంది బామ్మ. అమ్మ "ఏమిటి అబ్బాయి ఉత్తరం రాశాడా! ఏమని రాశాడూ? ఎప్పు డొస్తాట్ట?" అని అడుగుతూ బయటకు రాగానే "చదవరా పరంధామయ్యా! చదువు. ఉత్తరం చదువు. అదీ వింటుంది." అని నాన్నగారిని పురమాయిస్తుంది బామ్మ. నాన్నగారు నవ్వుతూ అలాగే అని "శ్రీ నాన్నగారికి నమస్కారాలు. నేను కులాసాగానే ఉన్నాను. ముఖ్యంగా వ్రాయునది ఏమనగా నేను ఇప్పుడు నా మనస్సు మార్చుకున్నాను. ఇంత కాలంగా మీరూ, అమ్మా బామ్మా అందరూ కోరుతున్నట్టుగా నేను మన జాపకిని చేసుకుంటాను. వెంటనే మన అంగీకారం మామయ్యకు తెలియపరచవలెను. వచ్చే ఆదివారం ముహూర్త నిర్ణయం కోసం మన ఊరు రమ్మని మామయ్యకు రాయవలెను. నేను తప్పనిసరిగా శనివారం సాయంత్రం బండిలో బయలుదేరి ఇంటికి వస్తున్నాను." ఇట్లు మీ శేఖరం. ఉత్తరం వినగానే అమ్మ కళ్ళు ఆనందంతో మెరిసిపోయి ఉంటాయి. "అయితే మరి మీన మేషాలు లెక్కపెట్టకుండా వెంటనే ఆ సంగతి అన్నయ్యకు రాయండి." అంటూండగానే బామ్మ అందుకొని "వెళ్ళరా వెళ్ళు శుభస్య శీఘ్రం" అని నాన్నగారిని పోస్టాఫీసుకు తరిమి ఉంటుంది."

ఊహాలోకంలో విచ్చలవిడిగా విహరిస్తున్న శేఖరాన్ని జాగ్రదవస్థలోకి రప్పించింది ఆస్టేషన్‌లో ఆగకుండాసాగిపోతున్న గూడ్సు బండి. శేఖరం వాచీ చూసుకున్నాడు. ఎనిమిది గంటలైంది. "అబ్బో! చాలా పొద్దుపోయిందే! సరే! ఇక ఇక్కడెందుకు! వాళ్ళకు బుద్ధి చెప్పి ఆ గదిలో పడితే సరిపోతుంది!' అనుకున్నాడు శేఖరం. గొంతుక తడి ఆరినట్టు అనిపించింది. మెల్లగా ఆ పక్కన


# ఉచితము!

## అమూల్

## బేబీ పుస్తకము



**అమూల్** బేబీ పుస్తకము ఇప్పుడు ఉచితంగా తల్లులకు ఇవ్వబడుతుంది.
గర్భధారణ, ప్రసవానికి ముందర జాగ్రత్త.
ప్రసవము, తల్లి పాలు, ఇతర ఆహారములు.
మిశ్రమ ఆహారమును అలవాటు చేయుట.
పిల్లవాని దినచర్య, పిల్లవాని అభివృద్ధి.
జబ్బులను అరికట్టుట. ప్రథమ చికిత్స.
పసితనమందలి సాధారణ రోగములు మరియు జబ్బుతో నున్న పిల్లవాని యొక్క సంరక్షణను గురించి వాస్తవికమైన అధ్యాయములు గల ఈ 48 పేజీల పుస్తకము సులభశైలిలో అగ్రగణ్యుడైన ఒక స్పెషలిస్టుచే వ్రాయబడినది.

ఈ క్రింది కూపన్‌ను నింపి
పోస్ట్ బ్యాగ్ 10124,
బొంబాయి-1కు,
ఖర్చుల నిమిత్తమై
60 పైసల స్టాంపులతో పంపండి.

పోస్టు బ్యాగ్ 10124కు, బొంబాయి-1
తెలుగులో వ్రాయబడిన అమూల్ బేబీ పుస్తకము యొక్క ప్రతిని ఉచితంగా నాకు పంపండి

స్పష్టమైన పెద్ద అక్షరములలో పేరు మరియు ఎడ్రెస్

TL 104

ASP/AME/31 TEL

ఉన్న పంపు దగ్గరకు వెళ్ళి నీళ్ళు తాగి సిగరెట్ ముట్టించుకుంటూ ఉండగా కొంచెం ముఖపరిచయం ఉన్న స్టేషన్ మాస్టరు "ఏంసార్! ఒక్కరే ఉన్నారు షికారు కొచ్చారా?" అంటూ పలకరించాడు. ఆ ప్రశ్న వినగానే ఒళ్ళు మండిపోయింది శేఖరానికి. "నీ బొంద. బండి తప్పి నా ఏడుపు నే నేడుస్తుంటే షికార్లా పాడూ." అనుకొని "అవును సార్! చల్లగాలికని ఇలా వచ్చాను." అని స్టేషన్ దాటి రోడ్డు మీద పడ్డాడు శేఖరం. నడుస్తున్నాడన్న మాటేగాని మనస్సంతా జానకి మీదికే మళ్ళిపోయింది. ఊహలన్నీ జానకి చుట్టూ పరిభ్రమిస్తున్నాయి.

"తను జానకిని చేసుకోటానికి ఒప్పుకున్నట్లు నాన్నగారు రాసిన ఉత్తరం అందగానే అత్తయ్యా మామయ్యా ఎంతగానో ఆనందపడిపోతారు! ఇక జానకి సంగతి సరే సరి! పాపం! జానకి ఎంత మంచిపిల్ల. ఆమెను తను ఇంత కాలంగా చిన్నచూపు చూశాడు. తను ఎన్ని జన్మలెత్తినా జానకి లాంటి పిల్ల దొరకనే దొరకదు. వినయంలో విద్యలో పనిలో పాటలో ఎవరికీ తీసిపోయేది కాదు జానకి. తను గుంటూరులో ఉన్నన్నాళ్ళూ ఎంత ఆదరంగా చూసింది జానకి! ఒకసారి తనకి జ్వరం వస్తే మూడు రోజుల పాటు నిద్రాహారాలు మాని దగ్గర ఉండి తనకి ఎంతో సేవ చేసింది జానకి. తననీ జానకినీ చూసిన వాళ్ళంతా చిలకా గోరింకల్లాగా ఉంటారని మెచ్చుకొంటూ ఉంటే లోపల్లోపల ఎంత మురిసిపోయేది జానకి! 'బావని చేసుకుంటావుటే జానకీ?' అని అమ్మ అడిగితే "పో అత్తా! నీకెప్పుడూ అదే గోల!" అని ఎంత ముద్దుగా కోపం నటించేది జానకి! అటువంటి జానకిని వద్దనటం తనదే పొరబాటు! తను జానకి విషయంలో చాలా అవివేకంగా ప్రవర్తించాడని నిజానికి తను ఈమధ్య చూసిన పిల్లల్లో ఏ విషయంలోనూ జానకి కాలిగోటికి కూడా సరిపోలే వాళ్ళు లేరు. అందులో ఒకపిల్ల బి. ఏ. దాకా చదువుకొన్నదనీ, చక్కదనాల చుక్కఅనీ విని తను పెళ్ళి చూపులకి వెళ్ళితే ఏం చేసింది? "నల్లని వాళ్ళని నేను చేసుకోను. పైగా కళ్ళద్దాలు పెట్టుకున్న వాళ్ళంటే నాకు పరమ అసహ్యం" అని తననీ తన నల్లద్దాల కళ్ళజోడునీ కూడా అవమానించి పంపించింది. మరొక పిల్లని "నీకు సంగీతం వచ్చునా? వంట బాగా చేతనవునా?" అని అడిగితే ఎదురు తిరిగి "మీకు టెన్నిస్ చేతనవునా? ఎప్పుడైనా రన్నింగ్ రేస్‌లో గెలిచారా? ఏవీ సర్టిఫికెట్లు?" అని ఎడతెగకుండా ప్రశ్నలవర్షం కురిపించింది. ఒక పిల్ల తండ్రిని "మీ అమ్మాయి జాతకం రాయించారా? పోనీ, జన్మనక్షత్రం అయినా జ్ఞాపకం ఉందా?" అని మాట సామెతగా అడిగితే "ఈ జాతకాల పిచ్చివాళ్ళని నేను చేసుకోను. ఇటువంటి వాడితో కాపురం చెయ్యటం కష్టం." అంటూ చివాలున లేచిపోయింది ఆపిల్ల. ఆ బెజవాడ పిల్ల నడక చూద్దామని "ఏదీ! కొంచెం లేచి అలా నడువు చూద్దాం" అంటే "ఏం మీకు కారు లేదూ! కనీసం కారు కూడా లేనివాడికి పెళ్ళేమిటండీ?" చులుకగా చూసి నవ్వి లేచిపోయింది. ఆ తెనాలి పిల్లని "నీవు బి. యస్. చదివావు గదా! ఉద్యోగం చెయ్యటం ఇష్టమేనా?" అంటే "ఏం? నా సంపాదన మీద బతుకుదామనా?" అని ఇంతింత కళ్ళు చేసుకొని కసిరికొట్టిపోయింది. ఈవిధంగా తన అన్వేషణ అంతా బూడిదలో పోసిన పన్నీరై పోయింది. ఈ రోజుల్లో ఆడపిల్లలకి, పెళ్ళిళ్ళు కావటం మహాకష్టంగా ఉందో అని దేశం అంతా ఒకటే గోల. మరి ఇలాంటి పిల్లలకి పెళ్ళిళ్ళు కావాలంటే ఎలా అవుతాయ్? తన మటుకు తాను ఉదారంగా పైసా కట్నం తీసుకోకుండా నచ్చిన పిల్లని చేసుకుందామంటే ఏదీ కుదిరితేనా? తనకు నచ్చిన పిల్లలు తనని తిరస్కరిస్తే, తనకు నచ్చని వాళ్ళని తను తిరస్కరించాడు. ఇక ఈ పద్ధతిలో తనకీ ఈ జన్మకి పెండ్లి గీత ఉన్నట్లు అనిపించటంలేదు. అందువల్లనే జరిగిన సంగతులు మరిచిపోయి మళ్ళీ తనమనస్సు జానకి మీదకే మళ్ళింది. తను జానకిని చేసుకోవాలని నిశ్చయించుకున్నాడు. తన ఉత్తరం ప్రకారం మామయ్య వచ్చి వాలి ఉంటారు. కాని తను మాత్రం సమయానికి ఇంటికి చేరలేకపోయాడు. తను రాకపోవటం చూచి మళ్ళీ తన మనసు మారి ఉంటుందనీ, జానకిని చేసుకోవటం నిజంగా తన కిష్టంలేదనీ మామయ్యావాళ్ళూ సందేహపడతారు. ముందొకసారి కాదన్నందుకే మనస్సు కష్టంగా ఉన్న మామయ్య ఈసారి ఒళ్ళు మండి "ఛీ ఛీ! ఈ మాట నిలకడ లేనివాడితో మాకు కుదరదు" అని తన దారిన తాను వెళ్ళిపోతే? ఏమో! అంతా అయోమయంగా ఉంది! అనుకుంటూ ముందుకు సాగాడు శేఖరం.

అతని మనస్సంతా వ్యగ్రమైపోయింది. ఎటు చూసినా కారుచీకటి. ఆలోచనా రహితంగా సాగిపోతున్న శేఖరాన్ని గది ముందుకు లాక్కొనిపోయాయి కాళ్ళు. వరండా మెట్లెక్కుతున్న శేఖరం "అబ్బ!" అని అదిరిపడ్డాడు. "ఎంత గట్టి ఎదురు దెబ్బ తగిలింది! దిక్కుమాలిన మెట్లు! ఒక్కొక్కటే ఎంత ఎత్తుగా కట్టించాడో వీడి సొమ్మంతా పోయినట్లు ఈ ఇంటివాడు!!" అని గొణుక్కుంటూ గది తాళం తీసి లైటు వేశాడు శేఖరం. కుర్చీలో కూర్చొని బూట్లు విప్పుతున్న శేఖరానికి తలుపు పక్కనే పోస్టుకవర్ కనిపించింది. "నాన్నగారే రాసి ఉండాలి కుటుంబ విషయాలు ఆఫీసు అడ్రస్‌కి రాస్తే ఇతర్లు చూస్తారని ఇక్కడికి రాయటం అలవాటేగా ఆయనకి." అనుకుంటూ కవరు విప్పాడు శేఖరం.

"చిరంజీవి శేఖరానికి ఆశీస్సులు. మొన్న నీ ఉత్తరంతో పాటే జానకి పెళ్ళి శుభలేఖ కూడా అందింది. పెండ్లికి మనల్ని అందరినీ తప్పక రమ్మని మరీ మరీ రాసింది జానకి. ఇందువెంట నీకు ఆ శుభలేఖ కూడా పంపుతున్నాను. గ్రహించవలెను." మీ తండ్రి పరంధామయ్య.

క్రింద జారిపడ్డ శుభలేఖ మీద పెద్ద పెద్ద అక్షరాలతో కొట్టొచ్చినట్లు కనిపిస్తున్న పేర్లు చదివాడు శేఖరం.

"వధువు: జానకి—వరుడు: రామచంద్ర ఐ. ఏ. యస్."●